మెట్టపైర్లు కళకళ


కీసరలో కళకళలాడుతున్న పత్తి చేను


కంచికచర్లలో పెసర పైరు


కంచికచర్లలో ఏపుగా మొక్కజొన్న

కంచికచర్ల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు కళకళ లాడుతున్నాయి. మే మాసంలో చెదురుముదురుగా కురిసిన వర్షాలకు రైతులు పలు రకాల పంటలను సాగుచేశారు. జూన్ నెలలో సకాలంలో వర్షాలు కురవకపోవటంతో రైతుల్లో గుబులు మొదలైంది. వేల పెట్టుబడి పెట్టి పంటలను సాగుచేస్తే వర్షాలు కురవకపోవటంతో ఏం చేయాలో రైతులకు పాలుపోలేదు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైరులన్నీ ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఇప్పటికే పెసర పంట మరో 20 రోజుల్లో కోతకు వస్తుంది. మొక్కజొన్న, పత్తి చేలు మాత్రం ఏపుగా పెరుగుతున్నాయి.

డివిజన్‌లో కురిసిన వర్షం...

గత మూడు రోజుల నుంచి వర్షం కురవటంతో రైతులు సాగుచేసిన పంటలు ఊపిరిపోసుకున్నాయి. నందిగామ సబ్ డివిజన్ పరిధిలో మూడు రోజులకు 362 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు. డివిజన్‌లో ఈనెల 20వ తేదీన 6.8 మి.మీ, 21న 113.8 మి.మీ, 22న 241.4 మి.మీ వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు సాగు చేసిన పంటలు..

నందిగామ డివిజన్ పరిధిలో కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పలు రకాల పంటలను సాగుచేశారు. కొన్ని చోట్ల నదీతీర పరివాహక ప్రాంతాల్లో బోర్ల కింద వరినాట్లు కూడా సాగుచేశారు. వరి 255 హెక్టార్లు, జొన్న 7 హెక్టార్లు, మొక్కజొన్న 2,714 హెక్టార్లు, పెసర 1527.8 హెక్టార్లు, పత్తి 10,228 హెక్టార్లు, సుగర్‌కేన్ 805 హెక్టార్లు, కంది పంట 89 హెక్టార్లు, మినుము 645 హెక్టార్ల వంతున పంటలను సాగుచేశారు.

తటాకాలను తలపిస్తున్న పంట పొలాలు

పెనుగంచిప్రోలు: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు తటాకాలను తలపిస్తున్నాయి. వర్షాలకు వత్సవాయి మండలం వేముల నర్వ గ్రామం నుంచి మండలంలోని ముచ్చింతాల వరదకు కూచివాగుకు పెనుగంచిప్రోలు వద్ద బంధం కాలువ పోటేయటంతో వరద నీరు పెనుగంచిప్రోలు, ముచ్చింతాల పొలాలపై ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షానికే పంట పొలాలను వరద నీరు ముంచేయటంతో భారీ వర్షం పడి మునేరుకు భారీగా వరద నీరు వస్తే తువ్వకాలువ గండ్లు పూడ్చకపోవటం వలన మరోసారి పంట పొలాలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.


పెద్దాపురంలో రోడ్డుపై నీటి ప్రవాహం

మండలంలో భారీ వర్షం..

వీరులపాడు: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి గ్రామాల్లో అంతర్గత రహదారులు జలమయం అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించాయి. మండలంలోని పెద్దాపురం గ్రామంలో పల్లపు ప్రాంత పత్తి పొలాలు నీట మునిగాయి.


ముచ్చింతాల వద్ద పంట పొలాల్లో నీరు


పెద్దాపురంలో పత్తి పొలంలో వర్షపు నీరు

విపత్తు ప్రమాద నష్టాల తగ్గింపుపై శిక్షణ

నందిగామ టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ లోవరాజు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మంగళవారం విపత్తు ప్రమాదాల వల్ల వచ్చే నష్టాల తగ్గింపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని లోతట్టు ప్రాంతాలలో నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని సచివాలయ సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఏఈ ఫణి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ లోవరాజు

120 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

నందిగామ రూరల్: మండలంలోని పెద్దవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ నందిగామ, డాక్టర్ లయన్ వై.జగన్‌మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్, క్లబ్ ప్రెసిడెంట్ మాలెంపాటి ప్రసాదరావు, క్లబ్ ప్రతినిధులు చెరుకుమల్లి శ్రీనివాసరావు, సీతారామారావు, యర్రంరెడ్డి గాంధీ, మారం వెంకట సత్యనారాయణ, ఆర్‌ఎల్ నరసింహారావు, డాక్టర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ముక్త్యాల గ్రామ పంచాయతీ అవినీతిపై ఫిర్యాదు

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా, ఎస్‌కే అజిత, షఫీ, అక్బర్, షాహిల్, మరి కొంత మందిమి కలసి ఫిర్యాదు చేశామని మంగళవారం తెలిపారు. ఈ నెల 14న వెలగపూడిలో ఈ ఫిర్యాదు అందజేశామన్నారు. పంచాయతీలో ప్రభుత్వ, గ్రామ పరిధిలోని కర్మాగారాల ద్వారా ఏటా రూ.2.40 కోట్ల మేర ఆదాయం వస్తుందన్నారు. 2020లో ఎన్నికైన సర్పంచ్, అప్పటి కార్యదర్శి పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసి, గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా నకిలీ బిల్లుల ద్వారా నిధులు డ్రా చేశారని తెలిపారు. 2022లో రూ.1.50 కోట్లను సర్పంచ్, కార్యదర్శి డ్రా చేశారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంతో ఫిర్యాదు చేశామని వివరించారు. విచారణ చేసి నిధులు రికవరీ చేయాలని, దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

సీతమ్మ అమ్మవారికి ఆషాఢం సారె

నందిగామ రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని గోళ్లమూడి గ్రామంలో సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో సీతమ్మ అమ్మవారికి గ్రామస్తులు మంగళవారం ఆషాఢ సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్, పూలు, పండ్లు, గాజులు, తదితరాలతో కూడిన సారెను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు.ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలు

నందిగామ టౌన్/నందిగామ రూరల్/కంచికచర్ల/వీరులపాడు: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వేడుకల్లో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంగునూరి కొండారెడ్డి, పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, ఎంపీపీలు పెసరమల్లి రమాదేవి, షేక్ మలక్ బషీర్, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.


నందిగామ పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

లీగల్ సెల్ ఆధ్వర్యంలో..

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ షేక్ సైదా, న్యాయవాదులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి బెజవాడ రాజశేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలో జన్మదిన వేడుకలను రాత్రి నిర్వహించారు. పార్టీ నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, బెజవాడ అనురాజ్, కార్తిక్, మాడుగుల నాగమ్మ, రుద్రపోగు శారద, నూకపోగు జ్యోతి పాల్గొన్నారు. కంచికచర్ల పట్టణంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పుట్టినరోజు వేడుకలు పార్టీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు తదితరులు పాల్గొన్నారు. వీరులపాడు మండలంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు జన్మదిన వేడుకలను వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో పార్టీ నాయకులు షేక్ షహనాజ్ బేగం, ఫయాజ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. నరసింహారావు పాలెం గ్రామంలో పచ్చల కోటేశ్వరరావు, అల్లూరులో మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, వీరులపాడులో శీలం వాసు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బలుసుపాడు రోడ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ఉచిత ఆయుర్వేద ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ కార్యదర్శి షేక్ ఖాసిం సైదా మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు విద్యార్థులకు ఆరోగ్యానికి చెందిన పరీక్షలు, మందులు అందజేసి ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు.

క్లుప్తంగా

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ పేట మండల గౌరవాధ్యక్షురాలు సోమోజు నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో 8 రోజులుగా చేస్తున్న సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. మంగళవారం సమ్మె శిబిరాన్ని సందర్శించిన నాగమణి వారికి మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపుపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ గౌసమియా, ప్రజాసంఘాల నాయకులు కోట కృష్ణ, ఆర్.శేషు, కోట రవికుమార్, దంతాల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, కాకనబోయిన లింగారావు, వెంకటేశ్వరరావు, షేక్ మీరాసాహెబ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు సీపీఎం నివాళి



జగ్గయ్యపేట అర్బన్: కమ్యూనిస్ట్ ఉద్యమ నేత, అనుభవశాలి వీఎస్.అచ్యుతానందన్ చిత్రపటానికి పలువురు సీపీఎం నాయకులు నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటు చేసిన అచ్యుతానందన్ చిత్రపటానికి సీపీఎం జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి ఎస్.నాగమణి, డీవీఆర్ నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి ఆ పార్టీ సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు నివాళులర్పించారు. సీపీఎం నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, ఆర్.శేషు, షేక్ గౌసమియా, కోట రవికుమార్, కాకనబోయిన వెంకటేశ్వరరావు, షేక్ బడే మియా, షేక్ మీరాసాహెబ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పారా ఎలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

నందిగామ రూరల్: మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ఏటిపట్టు గ్రామాల కన్వీనర్ రేఖ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాగల్లు గ్రామంలోని పార్టీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం కన్వీనర్, కేడీసీసీ మాజీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ నివాసంలో సాయంత్రం నాలుగు గంటలకు ఏటిపట్టు గ్రామాల నాయకుల విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు హాజరవుతారని చెప్పారు. ఏటిపట్టు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రంలో నారా వారి రాజ్యాంగం నడుస్తోంది

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



కంచికచర్ల: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అరెస్టులు చేయడమే పనిగా పాలన సాగుతుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు అన్నారు. కంచికచర్లలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు కక్షలు తారాస్థాయికి చేరాయని, లిక్కర్ కేసు పేరుతో అక్రమ అరెస్టులు చేయిస్తూ చంద్రబాబు, లోకేష్‌లు పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని అన్నారు. గడిచిన 13 నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వచ్చే ప్రజాదరణ చూసి జీర్ణించుకోలేక అరెస్టుల పేరుతో ఎల్లో మీడియా చంద్రబాబు కలసి ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పుతారని శ్రీనివాసరావు అన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేలు విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుడు రూ. 25 వేలను విరాళం అందించినట్లు ఆలయ ఈవో సాంబశివరావు మంగళవారం తెలిపారు. ఖమ్మంకు చెందిన తోటకూర రమేష్ వితరణ చేశారని చెప్పారు. దాతకు స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పక్కన నాయకులు

బాబు మోసాలను ఎండగడదాం

- జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు
- పెనుగంచిప్రోలులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ

పెనుగంచిప్రోలు: ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నెరవేర్చకపోవటంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కాకాని హరి గార్డెన్స్‌లో మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు ప్రజలను ఎంతగా వంచించారో ప్రజల్లో ఎండగట్టాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించారన్నారు. నిరుద్యోగ భృతి పేరుతో కూటమి ప్రభుత్వం యువతను, ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలను, పెట్టుబడి సాయం పేరుతో రైతులను దగా చేసిందని దుయ్యబట్టారు.

ఎన్ని కేసులు పెట్టినా భయపడం

వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలను అరెస్ట్ చేయటమే చంద్రబాబు,లోకేష్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదన్నారు. అన్ని గ్రామ పార్టీ అధ్యక్షుల నియామకం చేపట్టాలన్నారు. బాబు హామీలు, మోసాలపై క్యూ ఆర్ కోడ్‌ను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీపీల సంఘ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర యువజన విభాగపు కార్యదర్శి పృథ్వీ, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు చేని రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కాకాని ప్రవంతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుడిమెట్ల శంకర్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, కనకపూడి భాస్కరరావు, నియోజకవర్గ, నాయకులు గడేటి వెంకటరత్నం, దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, బోశెట్టి బ్రహ్మం, కీసర లోకేశ్వరరావు, యర్రంశెట్టి నాగబాబు, కోయ బాబి, బొడ్డు రవి, మల్లెబోయిన సైదులు, మస్తాన్‌వలీ, పసుపులేటి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి సోమయ్య, చేని కుమారి, సర్పంచ్‌లు పాపినేని వెంకటేశ్వరరావు,జొన్నలగడ్డ కిషోర్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

డివిజన్‌లో 241.4 మి.మీ వర్షపాతం

నందిగామ రూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో సోమవారం 241.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఉపగణాంకాధికారి ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలంలో అత్యధికంగా 45.8 మి.మీల వర్షం కురిసిందన్నారు. నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 118.8 మి.మీ వర్షం కురవగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 122.6 మి.మీల వర్షపాతం కురిసినట్లు తెలిపారు. నందిగామ మండలంలో 28.6 మి.మీలు, కంచికచర్ల మండలంలో 29.2 మి.మీలు, చందర్లపాడు మండలంలో 34.8 మి.మీ, వీరులపాడు మండలంలో 26.2 మి.మీల వర్షం కురిసింది. పెనుగంచిప్రోలు మండలంలో 42.6 మి.మీ, వత్సవాయి మండలంలో 26.2 మి.మీల వర్షం కురిసింది.

నందిగామలో భారీ వర్షం..

పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం సమయంలో ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

జగ్గయ్యపేట అర్బన్: పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన, చెందుతున్న జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం డిపో సెంటర్‌లోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక పక్షపాతిగా ఉన్న జగ్గయ్యపేట మొదటి ఎమ్మెల్యే కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా సేవలందించారని తెలిపారు. ఆగస్టు 1, 2 తేదీల్లో జరగనున్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వేదాద్రి ఎత్తిపోతల పథకం పూర్తిచేసేందుకు, పోలంపల్లి మునేరు ప్రాజక్టును, లింగాల బ్రిడ్జిని, పాలేటిపై కె.అగ్రహారం వద్ద నూతనంగా బ్రిడ్జి నిర్మించాలని, ఏ కొండూరు, తిరువూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ బాధితులకు కృష్ణా జలాలను పంపిణీ చేయాలని, బుడమేరు ప్రక్షాళన, జగ్గయ్యపేటకు రైల్వే పాసింజరును మంజూరు చేయాలని, ఊరుకు దగ్గరలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని తదితర సమస్యలపై పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జగ్గయ్యపేటలో నిర్వహించనున్న జిల్లా మహాసభల్లో పలు ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాన్ని నిర్మించుకునేలా ఈ మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. సమావేశంలో దళిత హక్కుల పోరాటసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కామ్రేడ్ బుట్టి రాయప్ప, పేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, సహాయ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మెటికల శ్రీనివాసరావు,సహాయ కార్యదర్శి భోగ్యం నాగులు, పట్టణ సహాయ కార్యదర్శి అసదుల్లా, కార్యవర్గ సభ్యులు రాణి, ఏఐవైఎఫ్ నాయకులు కరిసె మధు పాల్గొన్నారు.


సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దోనేపూడి శంకర్, నాయకులు

పార్కు.. పర్యవేక్షణ కరువు


విరిగిన రంగుల రాట్నం


పార్కులో వర్షపు నీటితో చిత్తడిగా

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మున్సిపల్ పార్కు అధికారుల పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా మారుతోంది. పట్టణంలో 54 వేలకు పైగా జనాభా ఉండటంతో సాయంత్రం వేళల్లో పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేద తీరేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కును సందర్శించేవారు. అయితే గత కొంత కాలంగా పార్కులో ఆట వస్తువులు, యోగా పరికరాలు అధ్వానంగా మారాయి. బెంచీలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. పార్కులో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. చిన్నారులు ఆడుకునే జారుడు బల్ల, ఊయల ప్రదేశాలలో వర్షపు నీరు చేరి రోజుల తరబడి నిలిచి ఉంటోంది. ఆహ్లాదం కోసం వచ్చి అనారోగ్యం బారిన పడాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లా మైనింగ్ నిధులు రూ.కోటితో పార్కును అభివృద్ధి చేశారు. అయితే ప్రస్తుతం పర్యవేక్షణ లేకపోవటం, చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోవటంతో ఫలితం లేకుండా పోయింది. అధికారులు స్పందించి పార్కులో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


పార్కులో విరిగిన బల్ల

– జగ్గయ్యపేట

పాము కాటుకు గురైన మహిళ

వీరులపాడు: ఓ మహిళ పాము కాటుకు గురైన ఘటన జయంతి గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన తాటి శ్రీనివాసరావు భార్య అలీమా గత ఆదివారం గ్రామ సమీపంలోని కూరగాయల తోటకు వెళ్లింది. పాము కాటుకు గురవటంతో కుటుంబ సభ్యులు విజయవాడలో ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అత్యవసర విభాగంలో వైద్య సేవలు పొందుతోంది.

రేపటి నుంచి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

జగ్గయ్యపేట: ఈ నెల 24 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు మండలంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు పేర్కొన్నారు. 24న రామచంద్రునిపేట,తక్కెళ్లపాడు, 25న మల్కాపురం, గండ్రాయి, 26న తిరుమలగిరి, చిల్లకల్లు, 27న గుండబోయినపాలెం, బండిపాలెం, 28న గౌరవరం, పోచంపల్లి, 29న రావిరాల, 30న ధర్మవరప్పాడుతండ, జయంతిపురం, 31న అగ్రహారం, ముక్త్యాల,ఆగస్టు 1న త్రిపురవరం, రెడ్డినాయక్‌తండా, బూదవాడ, 2న బలుసుపాడు, అన్నవరం, 3న గరికపాడు, అనుమంచిపల్లి, 4న షేర్‌మహ్మద్‌పేటలో జరుగుతాయి. గ్రామ, అనుబంధ విభాగాల ఎంపిక జరుగుతుంది.